క్లుప్తంగా

గంగదేవిపల్లిలో అధ్యయనం



గీసుకొండ : ఏపీలోని సత్యసాయి జిల్లా నంబూల పూలకుంట మండలంలోని 12 గ్రామాలకు చెందిన 25 మంది గ్రామ స్థాయి నాయకులు అనంతపురం జిల్లా రాయలసీమ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గంగదేవిపల్లిని శుక్రవారం సందర్శించి అధ్యయనం చేశారు. అభివృద్ధి తీరుతెన్నులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏరియా టీం లీడర్ కృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ నారాయణ, గంగాద్రి, హ్యూమన్ రిసోర్స్ టీం సభ్యులు ధనలక్ష్మి, నర్సింహ, బాలవికాస అసిస్టెంట్ ట్రెనింగ్ కోఆర్డినేటర్ కొట్టె రమాదేవి పాల్గొన్నారు. వారికి గ్రామం గురించి జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళితోపాటు ,మీడిద సుశీల, గూడ సరోజన వివరించారు.

ఎస్సైకి సన్మానం



రాయపర్తి : ఎస్సై వడ్డె సందీప్‌కుమార్‌ను స్థానిక ముస్లిం యువకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తొలుత ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మజీద్-ఏ-నూర్ సదర్ హుస్సేన్, మాజీ సదర్ అబ్దుల్ రెహ్మాన్, రహీమ్, యూసుఫ్, ఇక్బాల్, రఫీ, మహమూద్, రజాక్, ఖాసీం, అక్బర్, రియాజ్, వసీమ్ పాల్గొన్నారు.

'హనుమంతు నియామకం అభినందనీయం'

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ-స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఎస్‌డబ్ల్యూయూ)లో అతి కీలకమైన రాష్ట్ర సెక్రటరీ జనరల్ పదవి టీజేఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి హనుమంతును వరించడం అభినందనీయమని టీజేఎంయూ నర్సంపేట డిపో మాజీ సెక్రటరీ గొలనకొండ వేణు తెలిపారు. పట్టణంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ హోదాలో హనుమంతు ఉద్యోగుల హక్కుల సాధనకు పాటుపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టీసీలోని అన్ని యూనియన్లలో ఉన్న కార్మికులందరూ ఐఎన్టీయూసీ-ఎస్‌డబ్ల్యూయూలో చేరి యూనియన్‌ను బలోపేతం చేయాలని కోరారు.

డాక్టరేట్



కేయూ క్యాంపస్: వరంగల్‌కు చెందిన మహమ్మద్ ముఖీద్‌కు రంగారెడ్డి జిల్లా హిమాయత్‌నగర్ మొయినాబాద్ లోని చైతన్య వర్సిటీ (డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ) కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. న్యూ క్యాటలైటిక్ సిస్టమ్స్ ఫర్ సమ్ సెలెక్టివ్ సీ – సీ అండ్ సీ – హెటిరో ఆటమ్ బాండ్ ఫార్మేషన్స్ ఇన్ కెమికల్ సింథసిస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ.. మహ్మద్ ముఖీద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జగదీశ్‌కుమార్ ప్రకటించారు. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ నర్సింహాస్వామి పర్యవేక్షణలో మహ్మద్ ముఖీద్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

జాన్ మార్కండేయకు..

కాజీపేట: కాజీపేట పట్టణంలోని అల్ఫా ఓమేగా చర్చి వ్యవస్థాపకుడు, కొంతకాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న బిషప్ జాన్ మార్కండేయ.. శుక్రవారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆయనకు డే స్ప్రిన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా మార్కండేయకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ ఇండిపెండెంట్ బిజినెస్ కౌన్సిల్ అధ్యక్షుడు మార్టిన్ పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌కు సన్మానం

కాజీపేట అర్బన్: టీఎన్జీఓస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అన్నమనేని జగన్మోహన్‌ను హనుమకొండ వికాస్‌నగర్‌లోని తన నివాసంలో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఈసంపెల్లి సంజీవ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్‌రెడ్డి, మడికొండ బాబు, కలకోట్ల జయరాం, పసునూరి బాబు, జిలకర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

దర్గా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో ఈనెల 25, 26 తేదీల్లో జరగనున్న హజ్రత్ సేద్నా అబ్దుల్లా షా షాహిద్ రహెమతుల్లా అలీ దర్గా సందల్ ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య శుక్రవారం పరిశీలించారు. ముస్లిం పెద్దలతో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు.

కిక్కిరిసిన మద్దిమేడారం

● నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర



తల్లులకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

నల్లబెల్లి : మండలంలోని నాగరాజుపల్లి మద్దిమేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంతం భక్తులతో శుక్రవారం కిక్కిరిసింది. ఆదివాసీ ఇలవేల్పులైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు మద్దిమేడారంలో కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించి తన్మయత్వం పొందారు. కోరిన కోరికలు తీరిన భక్తులు అమ్మలకు ఎత్తు బంగారం, వడిబియ్యం, ముడుపులు కట్టి కానుకలుగా సమర్పించారు. గద్దెల సమ్మక్క-సారలమ్మల దర్శనంతో తన్మయం పొందిన భక్తులు రెండేళ్లకు మళ్లీ వస్తామంటూ తిరుగు ప్రయాణమై ఇంటి బాటపట్టారు. శివసత్తులు వడిబియ్యం కట్టుకొని బ్యాండు వాయిద్యాలతో ఆలయం చుట్టూ పూనకాలతో ప్రదర్శనలు నిర్వహించారు. జాతరలో సంతానం లేని మహిళలు సంతాన ప్రాప్తి కోరుతూ సమ్మక్క-సారలమ్మల గద్దెల వద్ద స్నానాలు చేసి తడిబట్టలతో వరాలు పట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఖమ్మం, కరీంనగర్ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో జాతర ప్రాంగణం కిటకిటలాడింది. నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజిని, మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి, ఆలయ కమిటీ చైర్మన్ గాదె సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తిరుగు పయనమైన భక్తులు

జాతరకు రెండ్రోజుల ముందుగానే చేరుకున్న పలువురు భక్తులు మద్దిమేడారం పరిసర ప్రాంతాల్లో గుడారాలు వేసుకున్నారు. బుధవారం సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు, గురువారం సమ్మక్క గద్దెలపైకి చేరుకోవడంతో గురువారం రాత్రి నుంచి మొక్కులు ఊపందుకున్నాయి. వనదేవతలను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్న భక్తులు శుక్రవారం సాయంత్రం నుంచి తిరుగు ప్రయాణమవుతున్నారు. జాతర సమీపంలో వెలిసిన గుడారాలు ఖాళీ అవుతున్నాయి.

నేడు తల్లుల వన ప్రవేశం..

జాతర చివరి రోజు కావడంతో సమ్మక్క-సారలమ్మలు శనివారం సాంప్రదాయ పద్ధతిలో జనం నుంచి వనంలోకి ప్రవేశిస్తారు. దీంతో అద్వితీయమైన మద్దిమేడారం జాతర ముగుస్తుంది.



ఎదురుకోళ్లతో భక్తులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు



పూజా కార్యక్రమాలను తిలకిస్తున్న భక్తులు

రాయపర్తి : మండలంలోని సన్నూరు వెంకటేశ్వర పల్లి గ్రామంలోని ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గరుడ హోమం, తిరుచ్చి వాహనసేవ, ధ్వజారోహనం (గరుడముద్దలు), నిత్య హోమం, బలి హరణం, ఎదుర్కోళ్ల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి రాకుండా అడ్డుకోవాలి

వర్ధన్నపేట : బీఆర్ఎస్ నాయకుడు మార్నేని రవీందర్‌రావును కాంగ్రెస్‌లోకి రాకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, కౌన్సిలర్ సమ్మెట సుధీర్ తెలిపారు. మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో టీడీపీలో, ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు కాంగ్రెస్‌లోకి రావడానికి ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. రవీందర్‌ను కాంగ్రెస్‌లోకి రావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. స్వార్థ కోసం పార్టీ మారడానికి యత్నిస్తున్న రవీందర్‌రావును చేర్చుకుంటే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో నాయకులు గుజ్జ రవీందర్‌రెడ్డి, వడ్లకొండ ఎల్లాగౌడ్, చిదరాల కుమారస్వామి, బంగారు సదానందం, మల్లెపాక సమ్మయ్య, తాళ్లపెల్లి యాదగిరి, చెరిపెల్లి బాబు, భూక్యా బాషానాయక్, కందిక ఎల్లస్వామి, బచ్చు గంగాధర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

ప్రజాచైతన్యమే సంకల్ప యాత్ర ధ్యేయం

● ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

వర్ధన్నపేట : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గడచిన పదేళ్లలో అందించిన సుపరిపాలనపై ప్రజలను చైతన్యవంతం చేయడమే విజయ సంకల్ప యాత్ర ధ్యేయమని బీజేపీ అనుబంధ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. ఈనెల 29న విజయ సంకల్ప యాత్ర నియోజకవర్గ కేంద్రానికి చేరుకోనున్న నేపథ్యంలో మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్స్‌లో పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీధర్ హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనతో భారత్‌కు ప్రపంచ దేశాల్లో తగిన గుర్తింపు లభించిందని చెప్పారు. బీజేపీ మూడోసారి అఖండ విజయం సాధించేలా విజయ సంకల్ప యాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. గడచిన పదేళ్లలో దేశం గర్వించేలా మోదీ అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకుని ధైర్యంగా అమలు చేశారన్నారు. ఆర్టికల్ 370 తొలగించి కాశ్మీర్‌లో స్వతంత్రం తీసుకొచ్చారని, ట్రిపుల్ తలాక్ బిల్లు రద్దు చేసి ముస్లిం మహిళల్లో ధైర్యాన్ని నింపారని, అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించారని గుర్తు చేశారు. రానున్న పార్లమెంటరీ ఎన్నికల్లో దేశంలో 400కుపైగా, తెలంగాణలో 10కిపైగా స్థానాల్లో పార్టీ గెలుపు ఖాయమన్నారు. ఈనెల 29న సాయంత్రం 7.30కు వర్ధన్నపేటలో బహిరంగ సభ ఉంటుందని వివరించారు. విజయ సంకల్ప యాత్రలో పార్టీ, అనుబంధ సంఘాల శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, బన్న ప్రభాకర్, రాజ్‌కుమార్, ఐత రవి, అనిల్, అమృతరావు, కొండేటి సత్యం, సురేశ్, బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

'కేంద్రం' రైతు వ్యతిరేక విధానాలు వీడాలి



నర్సంపేట : నిరసన తెలుపుతున్న నాయకులు



నర్సంపేట : అమరవీరుల స్తూపం వద్ద..

నర్సంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను వీడాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఉద్యమిస్తున్న రైతులపై కర్కశంగా వ్యవహరించి రైతు మృతికి కారణమవడాన్ని విమర్శిస్తూ ఆ పార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఓంకార్ విగ్రహం సెంటర్‌లో శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా, రైతులకు భారీగా నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన రైతు కుటుంబానికి పరిహారం ఇప్పించాలని, శాంతియుత చర్చలతో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలిండియా కిసాన్ ఫెడరేషన్(ఏఐకేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబురావు, ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్, రైతు సంఘం జిల్లా నాయకులు నాగెల్లి కొమురయ్య, ఏఐఎఫ్‌డీడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగాల రాగసుధ, ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను రమేశ్, డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేశెట్టి సదానందం, విద్యార్థి సంఘం గర్ల్స్ కన్వీనర్ గణిపాక బిందు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలకోట్ల యాదగిరి, కంకణాల మల్లిఖార్జున్, కర్నె సాంబయ్య, గణిపాక బాబు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద..

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి మాట్లాడారు. రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటంపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో కాల్పులు చేయించడం దుర్మార్గమన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కి వినాశకరమైన నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకొచ్చారని మండిపడ్డారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు హన్మకొండ శ్రీధర్, కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, బెంబెలి మలహల్‌రావు, బుర్రి ఆంజనేయులు, గడ్డమీది బాలకృష్ణ, రుద్రారపు లక్ష్మి, జగన్నాథం, కార్తీక్, గణిపాక విలియం కేరీ, దాసరి నరేశ్, తాటిపాముల వెంకన్న, సుధాకర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి: గిర్నిబావిలో..

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో..

దుగ్గొండి : మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణరైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి మాట్లాడారు. గతంలో రైతు ఉద్యమాలకు తలవంచిన కేంద్ర ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడంతో మళ్లీ ఉద్యమించాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, నాయకులు కోడెం రమేశ్, కొంగర నర్సింహాస్వామి, పొన్నం రాజు, కొండబత్తుల పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ సెంటర్ : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల గురుకుల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టు భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 29వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. 2023 డిసెంబర్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

ఎస్సీ కాలనీలో తాగునీటికి తండ్లాట

రెండ్రోజులకోసారి నల్లా నీరు

● వృథాగా మినీ వాటర్ ట్యాంకు

● సమస్య వాస్తవమే : జీపీ కార్యదర్శి



నీరు లేక వృథాగా ఉన్న మినీ వాటర్ ట్యాంకు



విద్యుత్ కనెక్షన్ కట్ చేసి ఉన్న స్టార్టర్

సంగెం : మండలంలోని రామచంద్రాపురం ఎస్సీ కాలనీ ప్రజలకు తాగునీటి కోసం తండ్లాట తప్పడం లేదు. ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా ఉన్నప్పటికీ గ్రామానికి భగీరథ నీరు తక్కువగా వస్తుండడంతో కాలనీవాసులకు నీటి కటకట ఏర్పడింది. కాలనీ కోసం మినీ వాటర్ ట్యాంకు, ప్రత్యేక బోర్ బావి ఉండగా విద్యుత్ మోటార్ బిగించి మినీ వాటర్ ట్యాంకు నింపి గతంలో కాలనీవాసులు వాడుకునే పరిస్థితి ఉండేది. కాగా నల్లాలు వచ్చినా రాకున్నా నీటి తిప్పలు వచ్చేవి కావు. కాని విద్యుత్ బిల్లు ఎక్కువగా వస్తోందంటూ నెల రోజుల క్రితం మినీ వాటర్ ట్యాంకుకు బోర్ మోటార్ కనెక్షన్ తొలగించారు. కొన్నాళ్లు నల్లా నీటితో నెట్టుకొచ్చిన కాలనీవాసులకు 10 రోజులుగా నల్లాలు రెండ్రోజులకోసారి వస్తుండంతో తాగునీటికి, వాడుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్న దుస్థితి నెలకొంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని మాజీ ఎంపీటీసీ వేల్పుల బాబు చెప్పారు. విద్యుత్ బిల్లు కేవలం రూ.800 మాత్రమే వచ్చిందని, పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకే విద్యుత్ కనెక్షన్ కట్ చేశామని విద్యుత్ సిబ్బంది చెప్పారని బాబు వాపోయారు. గ్రామస్తులందరికీ తాగునీరు అందించాల్సిన గ్రామ పంచాయతీ కార్యదర్శి మినీ వాటర్ ట్యాంక్‌కు నీరు రాకుండా విద్యుత్ కట్ చేయించి కాలనీకి నీరు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కార్యదర్శి తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో 50 ఇళ్లుండగా సుమారు 300 మంది నీటి కోసం గోస పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించి నీరందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య వాస్తవమే

గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవమే. మినీ వాటర్ ట్యాంకు వద్ద నీటి వాడకం అడ్డూ అదుపూ లేకుండా ఉండడంతో విద్యుత్ బిల్లు ఎక్కువగా వస్తుండడంతో విద్యుత్ కనెక్షన్ తీయించాం. వారం రోజులుగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు తక్కువగా వస్తోంది. దీంతో రెండ్రోజులకోసారి నల్లాలు విడుస్తున్నాం. కాలనీవాసులకు నీరు సరిపోవడం లేదంటున్నారు. త్వరలో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

-వంశీ, పంచాయతీ కార్యదర్శి

లక్ష్మీనారాయణ మృతి తీరని లోటు

నర్సంపేట రూరల్ : ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ కమిటీ సభ్యుడు పిట్టల లక్ష్మీనారాయణ మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నాగెల్లి కొమురయ్య, రాష్ట్ర నాయకులు కుసుంబ బాపురావు, వంగల రాగసుధ తెలిపారు. నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ మృతి చెందగా ఆయన మృతదేహానికి శుక్రవారం ఎర్ర జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొమురయ్య, బాపురావు, రాగసుధ మాట్లాడారు. లక్ష్మీనారాయణ పార్టీ ఏర్పడినప్పటి నుంచి కీలక భూమిక పోషించారని చెప్పారు. రైతులు, ప్రజల కోసం అనేక ఉద్యమాలు నిర్మించారని తెలిపారు. సిద్ధాంతానికి కట్టుబడి విలువల కోసం పని చేసిన మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే ఓంకార్ నాయకత్వంలో పేదల పక్షాన అనేక పోరాటాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం, జన్ను రమేశ్, మార్త నాగరాజు, మాషుక్, దామ సాంబయ్య, సీపీఐఎంఎల్ నాయకులు ఈర్ల పైడి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

గ్రామ పంచాయతీ కార్యదర్శి ఔదార్యం



చెన్నారావుపేట : గ్రామ అభివృద్ధి కోసం క్రియాశీలకంగా పని చేయడమే కాకుండా ఆపదలో ఉన్న యువకుడికి రక్తదానం చేసి పంచాయతీ కార్యదర్శి ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని కాల్‌నాయక్‌తండా శివారులోని బాల్‌నాయక్‌తండాకు చెందిన లావుడ్య శ్రీను గుండెపోటుకు గురై హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతడికి శస్త్రచికిత్స చేసేందుకు 6 యూనిట్ల రక్తం కావాలని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలిసి పంచాయతీ కార్యదర్శి వికాస్ స్పందించారు. వెంటనే ఆస్పత్రికి చేరుకుని యూనిట్ రక్తాన్ని దానం చేసి తండావాసులను ఆశ్చర్యానికి గురి చేశారు. వికాస్‌ను తండావాసులు అభినందించారు.